క్లుప్తంగా

అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం


మాట్లాడుతున్న ఆయుష్ డాక్టర్ శ్రీకాంత్

ఇచ్చోడ: అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందుతుందని ఆయుష్ డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ, పోషణ అభియాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారం విద్యార్థులు సక్రమంగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ నరేశ్, ఫార్మసిస్ట్ అరుణ, ఏఎన్‌ఎం రోజ, యోగా శిక్షకుడు సాయి, అంగన్‌వాడీ వర్కర్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ఇచ్చోడ: అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక ఇన్‌చార్జి అగ్నిమాపక శాఖ అధికారి అశోక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సలలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఇంద్రవెల్లి: మండలంలోని పిట్టబోంగరం గ్రామ పంచాయతీ పరిధిలోని బట్టగూడ గ్రామంలో కుంరం యాదవ్‌రావ్, జంగుబాయిల కూతురు భాగ్యశ్రీ పెళ్లికి శనివారం బట్టగూడ గ్రామస్తులు ఆధ్వర్యంలో తమవంతు సాయంగా రూ. 12 వేలు ఆర్థికసాయం అందజేశారు. గ్రామంలో ఏ ఇంట్లో పెళ్లిళ్లు జరిగినా.. కట్నకానుకలు రద్దు చేసి, ఆర్థిక సాయం అందజేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు వెట్టి బిలాదిరావ్, చహకటి లాల్‌సావ్, వెట్టి లచ్చు, కుంరం జుగాదివార్, యాదవ్‌రావ్ పాల్గొన్నారు.

26లోపు దరఖాస్తు చేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: గతంలో రెన్యూవల్ కానీ బార్లకు అర్హులైన వారిని లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేసేందుకు అర్హులైన వారి నుంచి ఈ నెల 26 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రెండ్ల విజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ. లక్ష డీడీ, చలానా రూపంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఆదిలాబాద్ పేరుతో తీసి దరఖాస్తు ఫారంతో పాటు మూడు పాస్‌పోర్ట్ సైజ్, ఆధార్ కార్డు, పాన్‌కార్డుతో కలిపి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆదిలాబాద్ డివిజన్ కార్యాలయంలో అందజేయాలన్నారు. 29న లాటరీ పద్ధతి ద్వారా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

జొన్నలు ఆరబెట్టి తీసుకురావాలి

తాంసి: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో జొన్నలు విక్రయానికి తీసుకొచ్చే రైతులు తేమశాతం 14 వచ్చే విధంగా జొన్నలను ఆరబెట్టి తీసుకురావాలని కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి కేశవ్ కోరారు. మార్కెట్‌యార్డ్‌కు ఎక్కువగా జొన్నలు విక్రయానికి వచ్చే అవకాశం ఉన్నందున పంటను ఆరబెట్టేందుకు అనుమతి లేదన్నారు. ఆయా గ్రామాలకు కేటాయించిన తేదీల వారీగా మాత్రమే అమ్మకానికి తీసుకువచ్చి రైతులు సహకరించాలని కోరారు. మధ్యాహ్నం ఒంటి గంట లోపు వచ్చిన పంటను మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల సమీపంలో శనివారం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఇచ్చోడ ఎస్సై తిరుపతి తెలిపారు. దాదాపుగా 50 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్న వ్యక్తి రావి చెట్టు కింద మృతి చెంది ఉన్నాడు. మృతుడు తెల్ల చొక్క, గ్రీన్ కలర్ లుంగి ధరించి ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

'మంత్రుల పర్యటనతో రైతులకు ఒరిగిందేమీ లేదు'

ఆదిలాబాద్‌టౌన్: భూ భారతి పేరుతో ఆదిలాబాదులో పర్యటించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్, సీతక్కలు రైతులకు చేసిందేమీ లేదని మాజీ మంత్రి జోగు రామన్న విమర్శించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతాంగానికి రైతుబంధు, రైతు బీమా రాకపోవడంతో వారికి ప్రోత్సాహం కరువైందని ఆరోపించారు. సభకు కార్యకర్తలు తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, అలాల్ అజయ్, నారాయణ, ప్రహ్లాద్, అష్రాఫ్, యూనిస్ అక్బాని, సాజిదొద్దీన్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు

- నర్సరీ మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ
- చలువ పందిళ్లు ఏర్పాటు
- ప్రతీరోజూ నీటిని అందిస్తున్న వన సేవకులు


తాంసిలో నర్సరీలో ఏర్పాటు చేసిన చలువ పందిరి

తాంసి: రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవం పేరిట ప్రతీ ఏటా గ్రామాల్లో మొక్కలు నాటుతున్నారు. నాటిన మొక్కలను సంరక్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుంది. వర్షాకాలంలో నిర్వహించే వన మహోత్సవం కార్యక్రమానికి వివిధ రకాల మొక్కలను ఇప్పటి నుంచే ఆయా గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో పెంచుతున్నారు. జనవరిలో నర్సరీలను సిద్ధం చేసి మిశ్రమ మట్టితో నింపిన ప్లాస్టిక్ సంచులలో విత్తనాలను వేశారు. విత్తనాలు మొలకెత్తి ప్రస్తుతం వివిధ దశలో ఎదిగే దశలో ఉన్నాయి. నర్సరీలలో ఎదిగే దశలో ఉన్న వివిధ రకాల మొక్కలకు ఎండ తగలకుండా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. మొక్కల సంరక్షణ కోసం ఆయా గ్రామపంచాయతీల సిబ్బంది ప్రత్యేకమైన చర్యలు చేపడుతున్నారు. ఈఏడాది వన మహోత్సవంలో భాగంగా మండలంలో 1.03 లక్షల మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. ఎండకు మొక్కలు దెబ్బతినకుండా నీటిని అందిస్తూ తగిన జాగ్రత్తలతో పాటు సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. అన్ని నర్సరీల్లో గ్రీన్‌మ్యాట్ పందిళ్లు ఏర్పాటు చేశారు.

వన సేవకులు..

నర్సరీల్లో పెంచే మొక్కలను సంరక్షించేందుకు వన సేవకులను నియమించారు. వారు ప్రతీరోజు నీటిని అందిస్తున్నారు. నాటిన విత్తనాలు మొలకెత్తడానికి, పెరుగుతున్న మొక్కలను రక్షించడానికి వన సేవకులు నర్సరీలో నిరంతరం సంరక్షణ పనులు చేపడుతున్నారు.

1.03 లక్షల మొక్కల పెంపకం..

తాంసి మండల వ్యాప్తంగా 13 గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ప్రతీ గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున నర్సరీ ఏర్పాటు చేశారు. ప్రతీ గ్రామంలో ఉన్న నర్సరీల్లో మొక్కల సంరక్షణకు వన సేవకుడిని నియమించారు. వీరు నర్సరీల్లో విత్తనాలు వేసిన మొదలు మొక్కలుగా ఎదిగే వరకు తగు చర్యలు తీసుకుంటున్నారు. నర్సరీల్లో బెడ్‌లుగా అమర్చిన మొక్కల మధ్యలో పిచ్చిమొక్కల కలుపు పెరుగకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. అదే విధంగా ఏపుగా పెరిగిన మొక్కలను ఒక చోటకి మారుస్తున్నారు. పూలు, పండ్లు, ఇతర మొక్కలను పంచాయతీలోని నర్సరీల్లో విరివిగా పెంచుతున్నారు. ఒక్కో నర్సరీలో 8 వేల నుంచి 11 వేల వరకు మొక్కలను పెంచుతున్నారు. మొత్తం 1.03 లక్షల మొక్కల పెంపకమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.

గ్రీన్‌మ్యాట్స్ ఏర్పాటు చేశాం



వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశాం. ప్రతీ గ్రామంలో అవసరమైన వివిధ రకాల మొక్కలను ఆయా గ్రామాల్లోని నర్సరీలో పెంచుతున్నాం. మండల వ్యాప్తంగా 13 నర్సరీలో 1.03లక్షల మొక్కలను పెంచుతున్నాం. మొక్కలు ఎండకు దెబ్బతినకుండా నర్సరీలో గ్రీన్‌మ్యాట్‌తో చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం.

– విజయ, ఉపాధిహామీ ఏపీవో, తాంసి

జాగ్రత్తలు పాటిస్తే టీబీ అరికట్టవచ్చు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: జాగ్రత్తలు పాటిస్తే టీబీని అరికట్టవచ్చని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైద్య సిబ్బందితో కలిసి టీబీ ముక్త భారత్‌కు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వాలు వ్యాధి సోకిన వారికి వెయ్యి రూపాయాలు, ఉచిత నిత్యావసర సరుకులు, గిరిజనులు ఉంటే ప్రయాణ ఖర్చుల నిమిత్తం రూ. 750 రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జైవంత్, టీబీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్, మాజీ సర్పంచ్ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎకరాకు 20 క్వింటాళ్లు కొనుగోలు చేయాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: రైతులు పండించిన జొన్న పంట ఎకరానికి ప్రభుత్వం 20 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆ సంఘం అధ్యక్షుడు సాబ్లే కిషోర్ సింగ్‌తో కలిసి ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చూడాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు పంటలను విక్రయించాలని, దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావు, పీఏసీ ఎస్ సంఘం ఉపాధ్యక్షుడు కలాలి వెంకట రమణ, సాబ్లే నానక్‌సింగ్, సాబ్లే ప్రతాప్ సింగ్, తిత్రే నారాయణ సింగ్, పోతారెడ్డి పాల్గొన్నారు.

చదువుతోనే అభివృద్ధి

- ఎస్పీ అఖిల్ మహాజన్


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

నార్నూర్: ప్రతిఒక్కరూ చదువుకోవాలని, చదువుతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఛత్తీస్‌ఘడ్ ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలతో మావోయిస్టులు సరిహద్దు గ్రామాలల్లో వచ్చి తలదాచుకునే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శనివారం గాదిగూడ మండలంలోని మారుమూల గ్రామమైన కొలామా గ్రామంలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనారోగ్యానికి గురైతే ప్రభుత్వ అస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలన్నారు. గంజాయి సాగు చేసి కేసుల పాలు కావద్దన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి మనోహర్, రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయసారథి, సీఐ రహీంపాషా, వైద్యులు నవనాథ్, సమీరా, ప్రవీణ్‌కుమార్, సంజీవ్, జీతేందర్, ఏఎస్పీ కాజల్, ఎస్సై నాగ్‌నాథ్ పాల్గొన్నారు.

రేపు దీక్ష శిబిరానికి మంత్రి సీతక్క రాక

కైలాస్‌నగర్: సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను స్థానిక పెన్‌గంగా గెస్ట్‌హౌస్‌లో కలిశారు. ఆదిలాబాద్ పట్టణంలోని సర్వే నెంబర్ 170, రూరల్ మండలం నిషాన్‌ఘాట్‌లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు మౌలిక వసతులు కల్పించాలనే డిమాండ్‌తో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గత 34 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కరెంట్, తాగునీరు, రోడ్ల నిర్మాణంతో పాటు జీవో 58 కింద ఇంటి పట్టాలివ్వాలనే డిమాండ్‌తో చేస్తున్న దీక్ష శిబిరాన్ని సందర్శించాల్సిందిగా కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి ఆదివారం ఉదయం 9.30గంటలకు శిబిరానికి వస్తానన్నారు.

పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

ఆదిలాబాద్: మావలలోని కొమరం భీం కాలనీలో నివసిస్తున్న ఆదివాసులందరికీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో తుడుందెబ్బ నాయకులు శనివారం ఎమ్మెల్యేను సత్కరించి, ఇళ్ల పట్టాల విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కొందరు కబ్జా చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే నిరుపేదలకు ఇళ్ల పట్టాల విషయంలో ప్రభుత్వం వెనుకడుగు వేయవద్దన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు గోడం గణేష్, తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

తాంసి: ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తప్పవనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముంతాజ్ బేగం అన్నారు. శనివారం భీంపూర్ మండలంలోని అర్లి(టి) అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అనంతరం చిరుధాన్యాలు, అంగన్‌వాడీలో ద్వారా అందించే పోషకాహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. చిన్నారులకు ప్రతీరోజు బాలమృతం, గుడ్డు తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నజీమా, సరోజ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవం విజయవంతం చేయండి

బేల: ఈనెల 27న వరంగల్‌లో బీఆర్ఎస్ 25సంవత్సాలు పూర్తి చేసుకుంటున్న క్రమంలో చేపడుతున్న రజతోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రావుత్ మనోహర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ రజతోత్సవం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఠాక్రే గంభీర్, సతీష్‌పవార్, దేవన్న, సాదిక్, ఠాక్రే మంగేష్, తేజ్‌రావు, గుండవార్ అకాష్, కోడే విపిన్ పాల్గొన్నారు.

అత్యధికం 166.. అత్యల్పం 2


వార్డుల వారీగా వివరాలతో కూడినజాబితాలను అందజేస్తున్న బల్దియా ఆర్‌వో కళ్యాణ్

- ఆదిలాబాద్ బల్దియాకు 1,351 ఇందిరమ్మ ఇళ్లు
- నేటి నుంచి లబ్ధిదారుల ఎంపికకు తుది సర్వే

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ పథకంలో భాగంగా ఆదిలాబాద్ మున్సిపాలిటీకి 1,351 ఇళ్లను కేటాయించారు. గతంలో పైలట్ ప్రాజెక్ట్‌గా జిల్లాలోని 17 గ్రామాలకు ఇళ్లు కేటాయించినా మున్సిపల్ పరిధిలో ఎలాంటి కేటాయింపులు చేపట్టలేదు. తాజాగా బల్దియా పరిధిలో కేటాయింపులు చేశారు. అత్యధికంగా వార్డు నంబర్ 4కు 166 ఇళ్లను కేటాయించగా, అత్యల్పంగా వార్డునంబర్ 37కు కేవలం రెండు ఇళ్లను కేటాయించారు. ఇటీవల చేపట్టిన సర్వేలో ఎంపిక చేసిన వారి వివరాలతో కూడిన జాబితాలను వార్డు ఆఫీసర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు శనివారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో అందజేశారు. క్షేత్రస్థాయిలో వివరాలను పకడ్బందీగా సేకరించి లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు వారికి సూచించారు.

వార్డుల వారీగా కేటాయించిన ఇళ్లు

వార్డునం.	ఇళ్లు	25	21
1	32	26	10
2	40	27	17
3	33	28	37
4	166	29	13
5	25	30	18
6	11	31	48
7	91	32	37
8	84	33	36
9	28	34	22
10	11	35	07
11	13	36	15
12	26	37	02
13	25	38	11
14	05	39	29
15	52	40	11
16	30	41	03
17	22	42	12
18	61	43	09
19	51	44	17
20	28	45	10
21	46	46	08
22	19	47	10
23	15	48	06
24	23	49	05

పర్సు అందజేత

బోథ్: మండల కేంద్రానికి చెందిన ఆడెపు విజయ్ కుమార్ తన పర్సును పోగొట్టుకున్నాడు. కాగా గ్రామానికి చెందిన చిట్టి సాగర్‌కు శనివారం పర్సు దొరికింది. పర్సును మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు మాసం అనిల్ కుమార్‌తో కలిసి విజయ్ కుమార్ అందజేసి నిజాయతీ చాటుకున్నాడు.

ఘనంగా వైఎస్ విజయమ్మ జన్మదిన వేడుకలు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ వైఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శనివారం వైయస్ విజయమ్మ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్ కే. ఆసిఫ్, ప్రతినిధులు షేక్ అస్లాం, సుభాన్, రహమత్ అలీ, రఫీ, ఉస్మాన్ పాల్గొన్నారు.

ఫ్యాన్లు పంపిణీ

ఆదిలాబాద్: గ్రంథాలయ పాఠకులు, నిరుద్యోగ అభ్యర్థుల వేసవి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని శివరాజే ఫౌండేషన్ ప్రతినిధి సావాపురే లఖన్ శనివారం రెండు ఫ్యాన్లను విరాళంగా అందించారు. గ్రంథాలయానికి వచ్చే నిరుద్యోగ అభ్యర్థులు, పాఠకులు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి సమస్యను పరిష్కరించాలనే ధ్యేయంతో ఫౌండేషన్ తరపున ఫ్యాన్లను అందించామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వైద్య దిలీప్ ఠాక్రే, విద్యాసాగర్, ఠాక్రే టీకాజీ, సచిన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కైలాస్‌నగర్: పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ చట్టం నిరసన సాకుతో హిందువులపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు డిమాండ్ చేశారు. ఘటనను నిరసిస్తూ శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందజేశారు. నిరసన పేరిట హిందూ మహిళలపై అత్యాచారం చేయడంతో పాటు ముగ్గురిని చంపారన్నారు. దుండగులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర కార్యవర్గంలో చోటు

ఆదిలాబాద్: తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గంలో జిల్లాకు చెందిన పలువురు జూనియర్ డాక్టర్లు చోటు దక్కించుకున్నారు. హైదరాబాదులో శనివారం నిర్వహించిన కార్యవర్గం ఎన్నికలో డాక్టర్ ఈ. అన్వేష్ కుమార్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికవ్వగా, డాక్టర్ ఎస్. అవినాష్ సంయుక్త కార్యదర్శిగా, కార్యనిర్వాహక కార్యదర్శిగా డా . ఎం. వరుణ్ సాయి ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యవర్గంలో చోటుదక్కడం పట్ల పలువురు జూడాలు వీరిని అభినందించారు.

ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్‌గా స్వామి

ఆదిలాబాద్: ప్రజానాట్యమండలి (పీఎన్ఎం) జిల్లా కన్వీనర్‌గా అగ్గిమల్ల స్వామి ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని భాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రంలో శనివారం మండలి రాష్ట్ర అధ్యక్షుడు వేముల ఆనంద్ సమక్షంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోకన్వీనర్లుగా డి.మమత, దర్శనాల నగేశ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ ప్రజల కోసం కళాకారులు నిరంతరం పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా చైతన్యం కోసం గీతాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. దోపిడీ వ్యవస్థ మీద పాటలు తూటాలుగా పని చేస్తాయన్నారు. కార్యక్రమంలో బొజ్జ ఆశన్న, లింగాల చిన్నన్న, స్వామి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్: ఖమ్మం జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 25 నుంచి 27వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెట్టి గణేష్ పిలుపునిచ్చారు. సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్రంలోని విద్యారంగ స్థితిగతులపైన చర్చించి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో విద్యారంగానికి కేటాయింపులు చేయడం లేదని విమర్శించారు. కేంద్రం 10 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. మహాసభకు అఖిలభారత కార్యదర్శి మయూక్ ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమ్, ప్రశాంతి పాల్గొన్నారు.

నిత్య అఖండ హరినామ సంకీర్తన జరగాలి

ఆదిలాబాద్: యాదాద్రి లక్ష్మినరసింహ స్వామి సన్నిధిలో నిత్య అఖండ హరినామ సంకీర్తన జరగాలని అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయ శంకరస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని అలఖ్ నిరంజన్ శ్రీ నరసింహ యోగీశ్వర పీఠాన్ని శనివారం సందర్శించారు. మే 7న హైదరాబాదులోని ఇందిరాపార్క్‌లో జరగనున్న హైందవ భక్తి కళా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నరసింహ యోగీశ్వరుల వారసులు ఆదినాథ్, హిందూస్ ఫర్ ప్యూరిటీ అండ్ ఈక్వాలిటీ అధికార ప్రతినిధి మల్లికా వల్లభ, జై భారత్ రాష్ట్ర కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి


వైద్య పరీక్షలు చేస్తున్న నరేందర్ రాథోడ్

నార్నూర్: గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. శనివారం గాదిగూడ మండలంలోని కొలామా బుద్ద మహర్‌గూడ గ్రామంలో పర్యటించారు. మహిళలకు వైద్య పరీక్షలు చేసి, ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాదిగూడ మండలంలోని కొలమా, బుద్ధగూడ, తోయగూడ, గౌరీ, హీరాపూర్, కునికసా పున్నగూడ వంటి గ్రామాల్లోని గర్భిణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో కాన్పు సమయానికి వారం రోజులు ముందే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఐరన్ మాత్రలతో పాటు రక్త పరీక్షలు ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. ఆయన వెంట వైద్యులు ప్రవీణ్ కుమార్, సంజీవ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బోథ్: సొనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 63వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2024–25 వార్షిక నివేదికను ఉపాధ్యాయులు ఓస శ్రీనివాస్ చదివి వినిపించారు. ఎంతో మంది విద్యార్థులు పాఠశాలలో చదివి ఉన్నత స్థానంలో ఉన్నారని ప్రధానోపాధ్యాయులు సచిన్ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యం అలరించాయి. తహసీల్దార్ మల్లేష్, ఎంపీడీవో రాజేశ్వర్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.